క్లుప్తంగా

వీవోఏ ఆత్మహత్యాయత్నం

బల్లికురవ: విధి నిర్వహణలో అధికారులు దుర్భాషలాడుతున్నారని వీవోఏ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈఘటన మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో శనివారం జరగగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం ప్రకారం గ్రామానికి చెందిన పావులూరి లక్ష్మీకి ఐదేళ్ల క్రితం భర్త చనిపోగా గ్రామస్తులు వీవోఏగా బాధ్యతలు అప్పగించారు. పొదుపు గ్రూపుల నిర్వహణతో బిడ్డలను చదివిస్తూ కుటుంబాన్ని వెళ్లదీస్తోంది. రెండు రోజుల క్రితం బల్లికురవలోని వైఎస్సార్ కేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులు విధి నిర్వహణలో దుర్భాషలాడారు. పదిమందిలో దుర్భాషలాడటంతో మనస్తాపం చెందిన లక్ష్మీ నిద్రమాత్రలు మింగి స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు గమనించి వైద్యం చేయిస్తున్నారు. రెండు రోజులకుగాని స్పృహలోకి వచ్చే అవకాశం లేదని స్థానిక వైద్యులు చెప్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు.

సంతమాగులూరు సీఐగా ప్రభాకర్



సీఐ ప్రభాకర్

అద్దంకి: సంతమాగులూరు సీఐగా బీ. ప్రభాకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేస్తున్న లక్ష్మణ్‌ను రేంజ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలు, ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నట్టు చెప్పారు. ప్రజలంతా సహకరించాలన్నారు.

కంప్యూటర్ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

చీరాల అర్బన్: పట్టణంలోని ఆవోపా కార్యాలయంలో కంప్యూటర్ శిక్షణకు 147 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆవోపా అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రిటైర్డు చీఫ్ ఇంజినీర్ గాదంశెట్టి సుబ్రహ్మణ్యం, సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ శీరాం ఇంద్రనీల్‌లు హాజరయ్యారు. వలివేటి మహాత్మా గాంధీ లీలావతి ఆవోపా కంప్యూటర్ శిక్షణ కేంద్రం ద్వారా 2005 నుంచి కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా కార్యదర్శి కే. ఏకాంబరేశ్వరబాబు, పేర్ల వెంకట్రామయ్య, సభ్యులు కోట రమేష్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

192 మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన అక్రమ మద్యం బాటిళ్లను ఆదివారం రాత్రి సంతమాగులూరు ఎస్సై శివకుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వివరాల మేరకు.. మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీ చేసి అక్రమంగా నిల్వ 192 బాటిళ్లు, నిందుతుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం గొప్పది

- ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు
- ప్రత్యేక పూజలు చేసిన శాప్‌నెట్ చైర్మన్ చైతన్య



రాజీవ్ కాలనీలో పూజలు చేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి/అద్దంకి రూరల్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం గొప్పదని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా పట్టణంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో కృష్ణచైతన్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ఉదయం ఆరు గంటల నుంచి ఆరాధన కార్యక్రమాలు మొదలయ్యాయి. సత్తెనపల్లికి చెందిన శ్రీశైలం అభిషేకం నిర్వహించారు. చైతన్యకు శాలువా కప్పి, పూలమాల వేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యాభివృద్ధికి చేయూత..

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పామర్తి శివజ్యోతి విద్యాభివృద్ధికి సంఘం తరుపున రూ.30 వేలను చైతన్య చేతుల మీదుగా విద్యార్థి తాతా సుబ్బారావుకు అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ గోనుగుంట రజని, ప్రకాశం జిల్లా సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, పట్టణ అధ్యక్షుడు పొన్నపల్లి బ్రహ్మానందం, అనంతు మురళి, జీ శ్రీనివాసాచారి, జీ హనుమంతరావు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ రాష్ట్ర డైరక్టర్ కే భువనేశ్వరి, సీహెచ్ వీరయ్య, కే రమేశ్, వీరప్పయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలోని బ్రహ్మంగారి దేవస్థానంలో చైతన్య ప్రత్యేక పూజలు చేశారు.

భవానిసెంటర్‌లో..

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను అద్దంకి పట్టణం భవానిసెంటర్‌లో వేంచేసి ఉన్న బ్రహ్మంగారి దేవస్థానంలో కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

యద్దనపూడి: గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పూనూరు, మార్టూరు–గన్నవరం దండు దారి వద్ద వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు, భజనా కార్యక్రమాలతో పాటు జెండా ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.



విద్యాభివృద్ధికి నగదు అందజేస్తున్న చైతన్య



చీరాల: అలంకరణలో బ్రహ్మేంద్రస్వామివారు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



దండు దారి వద్ద ఉన్న ఆలయంలో వీరబ్రహ్మేంద్ర స్వామి మూలవిరాట్

ఘనంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారి జయంతి



అలంకరణలో కన్యాకా పరమేశ్వరీ అమ్మవారు



102 కలశాలతో గంగాజలాన్ని తీసుకువస్తున్న మహిళలు

అద్దంకి రూరల్/బల్లికురవ: వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం స్థానిక శ్రీచక్రసహిత వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దేవస్థాన పాలకమండలి అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం భక్తులు గుండ్లకమ్మ నదినుంచి 102 కలశాలతో జలాన్ని గ్రామోత్సవం నిర్వహిస్తూ దేవస్థానం వద్దకు తీసుకువచ్చారు. జలాలతో గణపతి, నవగ్రహ, వాసవిపూజ, మూలయంత్ర హోమం, నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీరెతో కూడిన విశేష పుష్పాలతో అలంకరించారు.

చినగంజాం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ మందిరంలో వేంచేసియున్న అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి వాసవీ మాత జన్మదిన వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో భాగంగా శనివారం రాత్రి చండీ హోమం నిర్వహించారు. మహిళా భక్తులు 108 నీటి కలశాలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి ఆ నీటితో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలుతో పాటు వాసవీ ఆర్యవైశ్య యువజన సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.



చినగంజాం: చండీ హోమం నిర్వహిస్తున్న మహిళలు

వడ్డెరల అభివృద్ధికి సంక్షేమ సంఘం ముందడుగు

చీరాల: ఆంధ్రప్రదేశ్ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని హరిప్రసాద్ నగర్‌లోని ఆర్కే కాన్వెంట్ సమీపంలో సమావేశాన్ని నిర్వహించారు. సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెం అంజమ్మ, బాపట్ల జిల్లా అధ్యక్షులు వల్లెపు వేణు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పల్లపు శివయ్య ఆదేశాల మేరకు వడ్డెర సంక్షేమ సంఘంలో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి సంఘం తరుపున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంకమ్మరావు, చిన్నవెంకయ్య, కోటయ్య, శ్రీను, మురళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం

చీరాల రూరల్: బహుజనులకు రాజ్యాధికారం బహుజన్ సమాజ్‌వాది పార్టీతోనే సాధ్యమని, బహుజనులందరూ ఏకతాటిపైకి రావాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు దుడ్డు భాస్కరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి మే 7వ తేదీన హైద్రాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు విచ్చేస్తున్నందున సభను జయప్రదం చేయాలని పోస్టర్లు ఆవిష్కరించారు.

అకాల వర్షాలతో రైతుల బెంబేలు



బల్లికురవ: తడిసిన మిరపకాయలను ఆరబెట్టుకుంటున్న రైతులు



జే.పంగులూరు: కళ్లాల చుట్టూ కాలువలు తీసుకుంటున్న రైతులు

- కళ్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న
- కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీసిన రైతులు

బల్లికురవ/జే.పంగులూరు: ఆరుగాలం కష్టించి పంటలు పండించిన అకాల వర్షాలతో పంటలు తడిసి ముద్దవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పరపాలెం, కోటావారిపాలెం, వేమవరం, కొనిదెన, నక్కబొక్కలపాడు, బల్లికురవ, గుంటుపల్లి గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చి, మొక్కజొన్న పంటలు తడవకుండా రైతులు పొలాల్లోకి పరుగులు తీశారు. పంటలను ఒక చోటకు చేర్చి పరదాలు కప్పి కొంతమేర రక్షించుకోగలిగారు. వర్షం పోయాక తడిసిన మిరపకాయలను ఆరబెట్టుకున్నారు. ఏడాది అకాల వర్షాలు, తమను నట్టేట ముంచుతున్నాయని పైగ్రామాల రైతులు వాపోయారు.

– జే.పంగులూరు మండలంలోని 21 గ్రామాల్లో రబీ సీజన్‌లో 4527 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. దానిలో 70 శాతం వరకు రైతులు పంటను కోశారు. మిగిలిన 30 శాతం మొక్క జొన్న పంట అకాల వర్షంతో నెలకొరిగింది. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి రైతుల ఇబ్బందులకు గురౌతున్నారు.

మా భవిష్యత్ నువ్వే జగనన్న ..



ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తున్న నాయకులు

చీరాల టౌన్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో బిట్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'మా భవిష్యత్తు నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం వలన కలిగిన ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మస్తాన్, బాబు, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

స్వర్ణయుగంగా సంక్షేమ పాలన

- గడప గడపలో కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వర్ణయుగాన్ని తలపించేలా సంక్షేమ పాలన అందిస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చైతన్య పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బ్రోచర్‌లు అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, పింఛన్‌లు ఇస్తున్నారా వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయని ఆరాతీశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య స్థానిక నేతలు వల్లంరెడ్డి అంజిరెడ్డి, గన్నమనేని సీతారెడ్డి, వెంకటరామిరెడ్డి, జక్కం అంజిరెడ్డి, పెద్దిరెడ్డి కోటిరెడ్డి, ప్రత్తిపాటి వెంకయ్య, యద్రాకుల వెంకటేశ్వర్లు, కొండెద్దు వీరనారాయణ, చింతల శ్రీనివాసరావు, దివ్యా రామాంజనేయులు, ఈవోఆర్డీ జీ సీతామహాలక్ష్మీ, సెక్రటరీ కోటేశ్వరరావు, వీఆర్‌వో వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రోచర్లు అందజేసి సమస్యలు తెలుసుకుంటున్న చైతన్య

బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న బీజేపీ నాయకులు

అద్దంకి రూరల్: ప్రధానమంత్రి మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా అద్దంకిలోని భవానిసెంటర్‌లో పట్టణ బీజేపీ నాయకులు ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా 500 మందికి మజ్జిగ ప్యాకెట్లు, చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఉండవల్లి కృష్ణారావు, ఓబీసీ ప్రధాన కార్యదర్శి బూదాటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి విజయనిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు నర్రా శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు ఎంపిక

జే.పంగులూరు: స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో 10 రోజుల నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులకు ఖోఖో జట్టు ఎంపిక కోసం శిక్షణ జరుగుతోంది. శిక్షణలో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆదివారం జిల్లా క్రీడాధికారి రాజరాజేశ్వరి, స్టెప్ సీఈఓ బాబురావు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మే 1 నుంచి 5 వ తేదీ వరకు తిరుపతి జిల్లా తిరుపతి పట్టణంలో జరిగే ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా డీఎస్ డీఓ రాజరాజేశ్వరి మాట్లాడుతూ వేసవిలో జిల్లా నలుమూలల నుంచి మంచి ప్రతిభ కనపరిచే క్రీడాకారులకు శిక్షణ ఇచ్చామని, వారిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సీఎం కప్ తప్పకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ టోర్నమెంట్ స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు: పి శివారెడ్డి (ఈదర), ఏ శివనాగిరెడ్డి (పంగులూరు), పి స్వామినాథన్ (రుద్రవరం), వి ఏడుకొండల రెడ్డి (పంగులూరు), షేక్ ఆలీనవాజ్ (పంగులూరు), ఏ వీరాంజినేయులు (రుద్రవరం), జీఎస్‌వీ శివ (పంగులూరు), కె రామ్మోహన్ (పంగులూరు), కే వంశీ (రుద్రవరం), ఎం ఫణికుమార్ (పంగులూరు), ఆర్ సూరినాయుడు (పంగులూరు), కే మహేష్ (పంగులూరు) జట్టుకు కోచ్‌గా కే పేరిరెడ్డి వ్యవహరించారు.



ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

వేటపాలెం: చీరాల గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థి జీ. విశ్వనాథ్ కార్తికేయ జేఈఈ మెయిన్స్‌లో 94.53 శాతం మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎంసీహెచ్ వెంకటేశ్వర్లు ప్రకటనలో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

భక్తులకు అన్నదానం

అద్దంకి రూరల్: వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఎదురు బజారులో ఉన్న పురాతన కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో పూజా కార్యక్రమాల అనంతరం 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, పీఎల్‌వీ నరసింహారావు, జాగర్లమూడి శివకుమారి, కృష్ణ పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. వేసవి సెలవులను పురస్కరించుకుని వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి వాడరేవు తీరానికి చేరుకుని సముద్రంలో కేరింతలు కొడుతూ స్నానాలు ఆచరించారు. చిన్నారులు, యువకులు సముద్రం ఇసుకతో ఆడుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. దీంతో తీరం అంతా సందడి వాతావరణం నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు చేపట్టారు.



వాడరేవు తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు